
# గుప్పిటలో గోదారి

- ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి



"ఎక్కడికెళ్లారు ఇంతసేపూ?" ఉరిమినట్లు వినిపించింది ఊర్మిళ గొంతు తలుపు తీస్తూ.

పిల్లిలా అడుగుపెట్టబోతున్న భాస్కరం ఉలిక్కిపడ్డాడు.

అనుకున్నంతా అయ్యింది. ఎంత శబ్దం చెయ్యకుండా వచ్చి పడుకుందా మనుకున్నా కుదరలేదు. ఊర్మిళవి పాము చెవులు. అక్కడికీ ప్రొద్దున అమ్మకి చెప్పి వెళ్లాడు. హాల్లో పడుకుని, తను రాగానే తలుపు తీయమని చెప్పాడు. కానీ ఈవిడెలా ఎదురయ్యిందో?

తన పిచ్చిగానీ, తననే నిలువని య్యదు. అల్లాంటిది గంగిగోవులాంటి అమ్మ ఒక లెక్కా? అమ్మ హాల్లో పడుకోబోయినప్పుడే గ్రహించి వుంటుంది. అమ్మని కూడా ఏదో అనే వుంటుంది. పాపం అమ్మ.

## కథ

''మాట్లాడరేం? పిల్లల పరీక్షలు తొందరగా రమ్మని చెప్పానా? షికార్లు తగ్గించుకోమన్నానా? అయినా లెక్కలేదన్నమాట. స్టీరియోఫోనిక్ సౌండ్‌తో వీధరుగు మీద నుంచొని అడుగుతోంది.

సభ్యత కోసం ఎవరూ బయటకి రాకున్నా, ఆ నిశ్శబ్ద వేళ ఆ మాటలు అందరికీ వినిపిస్తూనే వుంటాయని తనని గురించి అందరూ నవ్వుకోవడమో లేక జాలి పడడమో చేస్తుంటారని కూడా తెలుసు. కానీ ఏం చేస్తాడు? ''పూజ కొద్దీ పురుషుడు'' అన్న వాళ్లున్నారు కానీ, ''పుణ్యం కొద్దీ పెళ్లాం'' అని ఎవరూ అన లేదు కదా!

''లోపలకి రండి. ఎందుకా కొంగజపం?'' మరోసారి ఉరుముతూ లోపలకి వచ్చింది.

''అమ్మయ్య!'' అనుకుంటూ లోపలకి వచ్చాడు భాస్కరం. కానీ ఇంతలోనే....

''నేను ఇంత అడిగినా మాట్లాడరేం? ఇంత సేపూ ఎక్కడ ఊరేగారు?'' అంది మళ్లీ.

''ఆఫీసులోనే ఉన్నాను. పని..'' అన్నాడు లోగొంతుకతో. భాస్కరానికి చిన్నగా మాట్లాడడం ఎంత అలవాటో, ఎంత ఇష్టమో....అంతకు పూర్తి వ్యతిరేకం ఊర్మిళ.

''నిజంగానేనా? నేనొక్కదాన్నే ఛావాలా అన్నీటికీ. ఇంటి పని, పిల్లల చదువులూ అన్నీ నా బాధ్యతలేనా?'' ఆఫీసులో ఉన్నానన గానే కొంచెం శాంతించి, కంచం పెట్టింది. అయినా కొంచెం విసురుగానే.

''నే తింటాలే. అన్నీ ఇక్కడే వున్నాయిగా'' అన్నాడు సాధ్యమైనంత మెల్లిగా. తల్లికి వినిపిస్తే అతో బాధ. ఆవిడ ఓర్చుకో లేక చిన్న మాట, ''మగాడు, ఇంటికి రాగానే ఎందుకమ్మా''అంటుంది అంతే.... అయిపోయిందే. ఇలా బాధ్యత లేకుండా పెంచినందుకు ఆవిడని నానా మాటలు అంటుంది. కన్న ప్రేమ వల్లా, భాస్కరం నెమ్మదితనం, మెతకతనం తెలియడం వల్ల తల్లి ఎప్పుడైనా అలా అంటుంది. ఆవిడకి భర్తని ఎదిరించడం అనేది మింగుడు పడని విషయం. అత్యంత ఆశ్చర్యకరం. ఇదైతే బాధాకరం కూడా.


''నువ్వెళ్లి పడుకో'' అన్నాడు గొడవ అంతటితో సద్దుమణుగుతున్నందుకు ఆనందిస్తూ. ఖర్మ...దీని పేరు ఊర్మిళే గానీ, దీనికి నిద్రే రాదు. ఇంట్లో అందరూ పడుకున్నాకే దానికి నిద్ర వస్తుంది.

''ఇదేమిటి? రాత్రి అన్ని అబద్ధాలు చెప్పారు'' ఇంకా నిద్ర మంచం మీంచి లేవలేదు భాస్కరం. ఉరుముల్లాంటి మాటలతో బలవంతంగా కళ్లు తెరిచాడు.

ఇంటర్‌పోల్ ఏజెంటులా చేతిలో పేపరుతో గుడ్లురిమి చూస్తోంది.

''ఏ..ఏమిటి.'' అన్నాడు తడబడుతూ...

పేపరు పక్క మీద విసిరేసింది. కల్చరల్ జోన్‌లో తన పేరు కింది అండర్‌లైన్ చేసి వుంది. వద్దన్నా వినకుండా తనను రాత్రి బలవంతంగా స్టేజీ మీదకు లాగి ప్రార్థనా గీతం పాడించారు. తన పేరు పేపర్లో పడింది. కొంప మునిగింది అనుకున్నాడు. తన



జీవితం మీద తనకే విరక్తి పుట్టింది.

"అబద్ధాలు..అబద్ధాలు. నోరు విప్పితే చాలు అబద్ధాలు. పిల్లల పరీక్షలు బాబూ రోజులెలా వున్నాయి. కాంపిటీషన్ వరల్డ్ కదా. మనమూ కొంచెంద శ్రద్ధ పెడితే బాగుంటుంది అన్నా. చెవినే సుకుంటారా? మన సభలూ, మన నాటకాలు, మన కీర్తి మనకి కావాలి. పెళ్లాం, పిల్లలెలా పోతే యేం? అల్లాంటప్పుడు పెళ్లి ఎందుకు చేసుకోవాలి? వడగళ్లలా రాలుతున్నాయి మాటలు.

లేస్తూనే మూడ్ ఆఫ్ అయిపోయింది. ఛీ..ఛీ.. ఏం బ్రతుకు. తన కిష్టమైన ఒక నాటకం చూడడానికి లేదు. ఒక సంగీత సభకి వెళ్లడానికి లేదు. గొంతెత్తి పాడుకోవడానికి లేదు. సాహితీ సభలకి వెళ్లడానికి అసలే లేదు. ఆఫీసుకెళ్లి జీతం డబ్బు తెచ్చి, ఇంట్లో పోయాలి. పెళ్లాన్ని షికారుకు తిప్పాలి. పిల్లలని చదివించాలి. ఇదేనా జీవితం? ఇంత సంపాదించినా ఏం లాభం? తన కోరిక ఒక్కటీ తీరదు. ఒక డెక్ కొనుక్కోలేదు. మంచి పుస్తకాలు కొనుక్కోలేదు. నాటకాలు చూడలేదు. కేబుల్ పెట్టించలేదు. చదువులు పాడవతాయంటుంది. లేదంటే అనవసర ఖర్చులంటుంది.

ఇంతకీ తన తప్పేమిటో అర్థం కాదు. తానేమైనా తాగి తందనాలాడుతున్నాడా? రేసులకెళుతున్నాడా? పేకాటాడుతున్నాడా? కనీసం సిగరెట్లు అయినా తాగడు. తనకి చిన్నప్పటి నుంచి సాహిత్యాభిలాష, నాట కాభిలాష ఎక్కువ. అందులో పద్య కవితలంటే మరీ ఇష్టం. పద్య నాటకాలు, పౌరాణికనాటకాల సంగతి సరేసరి. చెవి కోసుకుంటాడు. ఎన్నో రోజులకి మంచి నటులతో పద్య నాటకం వేశారు. కోరిక చంపుకోలేక భయపడుతూనే వెళ్లాడు. అక్కడికీ నటించే కోరికను ఎప్పుడో చంపుకున్నాడు. కనీసం చూడడానికయినా అదృష్టం లేదా? తన జీవితం మీద తనకే విసుగేసింది.


అసలు చిన్నప్పుడు తనని అందరూ ఎంత మెచ్చుకునేవారు! "ఆల్ రౌండర్‌వి" రా నీవు అనే

"ఇదిగో మీకే. నిన్న అద్భుతంగా పాడారట. వాళ్ల ప్రోగ్రాంకి కూడా పాడాలట. ఇంకో ఆహ్వానం వచ్చింది. వెళ్లండి" విసురుగా అంటూ కార్డ్‌లెస్ ఫోన్ మీద పడేసి వెళ్లింది.

వాళ్లు. అందరూ ఏదో ఒక దాంట్లో వుంటారు. తను అనేక రంగాల్లో వుండడమే కాక, పేరు. ప్రావీణ్యం కూడా పొందాడు. పెళ్లయింది. అన్నింటికీ ఫుల్‌స్టాప్ పడింది. నిజంగా ఇంకెవరయినా అయితే ఇలాంటి ప్రముఖుడు భర్తగా దొరికినందుకు ఎంతగా ఆనందించేవారో. తన భార్య....?

ఎప్పుడో ఆగింది జడివాన. రాత్రి కురవకుండా ఆగిన వర్షం పొద్దున తుఫానులా అయింది. తల్లి జాలిగా, కోపంగా తన వంక, భార్య వంక చూడడం తప్ప ఏం చెయ్య లేకపోయింది. అంటే ఆవిడకి ఆ ఇంట్లో ఆ పాటి స్థానం వుండదని తెలుసు. తండ్రి లేడు. తనకి చిన్నప్పుడు అనేక రంగాల్లో బహుమతులు వచ్చేవి. తనకి సంగీతంలో ప్రైజ్ వస్తే "నా బాబు ఘంటసాల అంతటి వాడు అవుతాడు" అనేది. నాటకంలో ప్రైజ్ వస్తే ఎస్వీ రంగారావంతటి వాడు అవుతాడని , ఏ కథలో, కవితలో రాసి బహుమతులు వస్తే ఏ రాచకొండ అంతటి వాడో అవుతాడని మురిసిపోయేది తల్లి. చివరకి ఒక సామాన్య వ్యక్తి కంటే తక్కువ అయ్యాడు. అతనికి కనీసం చూసే స్వాతంత్ర్యం అయినా వుంటుంది. తనకదీ లేదు.

ఫోన్ మోగింది వింటూ అలాగే వున్నాడు. ఎవరూ ఎత్తలేదు. ఎత్తే స్వాతంత్ర్యం లేదు. ఎక్కడి నుంచి ఫోన్ వచ్చినా తనే అందుకొని సెన్సార్ చేసేస్తుంది. సగం సార్లు తన ఎదుటే తను లేడని చెబుతుంది. అందుకే తనకి ఆత్మీయులు కూడా దూరమవుతున్నారు. తనకే ఇష్టం లేక గర్వంతోటి అలా చేస్తున్నాడేమో అనుకునే వాళ్లే ఎక్కువయ్యారు. ఆహ్వానం పంపినా, తను ఎక్కడికీ వెళ్లకపోవడం వల్ల ఎంత ఇది అయినా అందరి వద్ద భార్యని బయటపడేయలేడు కదా. అందుకే తన కి కుదరడం లేదని, బిజీగా వుంటున్నానని చెప్పడంతోటి తనకి పొగరు ఎక్కువమయిందని చాలా మంది భావన.




పోనీ ఇంతకీ ఆమె పడిపోయే పాటుకానీ లేదా కష్టపడిపోవాల్సిన అవసరం గానీ ఏమీ లేవు. పిల్లలని మంచి స్కూల్లో వేశాడు. ట్యూషన్ పెట్టించాడు. ఇంటి పనులకి పిల్ల వుంది. వంట తల్లే చేస్తుంది. చేతినిండా పెద్దల సంపాదన, తన సంపాదన. ఎంత ఆనందిచవచ్చు! "అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని" అంటారు ఇదేనేమో. చాలా మంది ఆడవాళ్లు ఇంటా బయటా ఎంత కష్టపడతారు? అది కూడా లేదామెకి. ఉద్యోగం కూడా చెయ్యదు.

"ఇదిగో మీకే. నిన్న అద్భుతంగా పాడారట. వాళ్ల ప్రోగ్రాంకి కూడా పాడాలట. ఇంకో ఆహ్వానం వచ్చింది. వెళ్లండి" విసురుగా అంటూ కార్డ్‌లెస్ ఫోన్ మీద పడేసి వెళ్లింది.

ఏ మనిషో! అవతల వాళ్లకి వినిపిస్తాయని కూడా లేదు. మళ్లీ చదువుకుంది. ఏం లాభం? పోనీ ఉద్యోగానికయినా పోదూ అంటే..."నాకేం అవసరం ఉద్యోగం" అంటుంది.

తనకి వీలు కాదని చెప్పి పెట్టేశాడు. కానీ మనసంతా దుఃఖంతో నిండిపోయింది. ఎంత మంచి సంస్థ. సినిమా మ్యూజిక్ డైరెక్టర్ కూడా వస్తున్నాడట. ఈ మహాతల్లి అన్నది అవతల వినబడినట్లున్నది. 'ఇంత మంచి అవకాశం అందుకోలేకపోతున్నావు నీ ఖర్మ.' అన్నట్లు మాట్లాడి పెట్టేశారు.

నిజంగా తన దురదృష్టమే. నిరాశగా అనుకొని పెట్టింది తిని, ఆఫీసుకి బయలుదేరాడు. కారున్నా, ఆఫీసుకి బస్సులోనే వెళ్లాలి. లేకపోతే టైముకి ఇంటికి రాడని భయం.

తన క్లోజ్ ఫ్రెండ్ అంటాడు. "ఎందుకు రా నువ్వింత భరిస్తావు?" అని భరించక ఏం చేస్తాడు? భరించాలి. లేదా విడిపోవాలి. అంతేగా. పిల్లల కోసం విడిపోలేడు. ఇక మిగిలింది భరించడమేగా! అదే చేస్తున్నాడు.

సాధారణంగా పెళ్లయితే భర్త లేదా అత్తమామల ఆజ్ఞప్రకారమో, కోరిక ప్రకారమో కళలు చంపుకొని, ఇంట్లో కూర్చుని బాధ పడే ఆడవాళ్లని చూసాడు. విన్నాడు కానీ, మగాడు భరించడం, సహించడం, కళలు చంపుకోవడం ఎవరూ విని వుండకపోవచ్చు. కళలు చంపుకున్న ఆడవాళ్లని పాపం ఆడది అనుకునే వాళ్లకి, తన లాంటి మగ వాళ్లు కూడా వుంటారని తెలిసో తెలియదో. ఒక వేళ తెలిస్తే ఏమంటారు? అనుకుంటూ గుండెల్లో పొంగే గోదారిని గుప్పిట్లో బిగిస్తూ ఆఫీసు బస్సెక్కాడు భాస్కరం. ఎందుకంటే గుప్పిట్లో వున్నంత సేపే గుట్టు. గుప్పిట విప్పితే అంతా రట్టే కదా... పాపం భాస్కరం!

*